బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా సూర్యప్రకాశ్



నియామక పత్రం అందుకుంటున్న సూర్యప్రకాశ్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన సూర్యప్రకాశ్ అన్నవజ్ఝుల తెలంగాణ బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. బుధవారం నగరంలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎండోమెంట్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల అనిల్‌కుమార్ చేతుల మీదుగా నియామక ప్రతాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దేవాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు, బస్తీలకు చెందిన ప్రజలు బుధవారం ఆయనను కలిశారు. బౌరంపేటలోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలపై వినతి పత్రాలను అందచేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శంభీపూర్ రాజు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సీఎంను కలిసిన ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతల నాగరాజు

సుభాష్‌నగర్: మేడ్చల్ జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా నియమితులైన చింతల నాగరాజు బుధవారం మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, కూన శ్రీశైలంగౌడ్‌లతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు.

నిజాంపేట్ మేయర్‌ను కలసిన కార్పొరేటర్లు



మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

నిజాంపేట్: క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు, నాయకులు మేయర్ కొలన్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ దంపతులను శాలువతో సన్మానించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని నీలారెడ్డి ఆకాంక్షించారు. కార్పొరేటర్లు సురేష్‌రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆవుల జగన్‌యాదవ్, వెంగయ్యచౌదరి, రమేష్‌యాదవ్, సాయి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

మేమింతే..

తాగునీటిని వృథా చేస్తున్న వినియోగదారులు
వాల్వ్‌లు బిగించకపోవడంతో వృథాగా పోతున్న నీరు

జగద్గిరిగుట్ట: నీటి వినియోగంపై అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా 'మేమింతే..'అన్నట్లు వినియోగదారులు ప్రవర్తిస్తున్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నీటిని రోడ్లపైనే వదులుతున్నారు. ఇంట్లో సరిపడ నీటిని పట్టుకున్న తర్వాత వాహనాలను కడుగుతున్నారు. ఇటీవలే ఈ విషయమై అవగాహన సదస్సులు కూడా ప్రారంభమయ్యాయి. కాని తమకు ఇవేమీ వర్తించవన్నట్లు నీటిని వినియోగించడంలో అశ్రద్ధ వహిస్తున్నారు. ట్యాంక్‌లు నిండిన తర్వాత బంద్ చేయడానికి వినియోగించాల్సిన వాల్వ్‌ని బిగించుకపోవడంతో నీరు వృథాగా పోతోంది. ఇలా చేసిన వారికి జరిమానా విధిస్తామని చెప్పినా పట్టించుకోకపోవడం గమనార్హం.



సోమయ్యనగర్, లెనిన్‌నగర్ ప్రధాన రహదారుల్లో వృథాగా పోతున్న తాగునీరు

విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు

చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



అధికారులు పనులు నిలిపి వేయడంతో ఇలా..

సుభాష్‌నగర్: ఒకవైపు గ్రేటర్ కమిషనర్ అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా కిందిస్థాయి సిబ్బంది మాత్రం వాటిని అమలు పర్చడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు గ్రేటర్ ఆదాయానికి తీవ్రంగా గండి పడుతుంది. గాజులరామారం సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. నిర్మాణదారులు ఇచ్చే లంచాలకు అలవాటు పడ్డ వీరు మొదటి దశలోనే అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాల్సి ఉండగా కేవలం నోటీసుల ద్వారా కాలం వెళ్లదీస్తూ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు.

- దీంతో విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ నిర్మాణాలు వెలిసి జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. అనుమతులు తీసుకుంటే లక్షల్లో డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుందని అక్రమార్కులు అధికారులను మచ్చిక చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఇక్కడ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చిన అధికారులు ఏ ఒక్క నిర్మాణాన్ని కూల్చివేయకుండా వస్తున్నారు.
- నిబంధనలకు విరుద్ధంగా జనవాసాల మధ్యలో భారీ షెడ్లు వెలుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం నోటీసులతో సరిపెట్టి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనడానికి సూరారం డివిజన్ శ్రీకృష్ణ నగర్‌లో మూడు రోజుల వ్యవధిలో ఓ భారీ షెడ్డు నిర్మాణం రూపుదిద్దుకోవడమే నిదర్శనంగా చెప్పుకోవచ్చు.
- శ్రీకృష్ణనగర్‌లో ఓ వ్యక్తి సుమారు 600 గజాల విస్తీర్ణంలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్ నిర్మాణం చేపట్టాడు. విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఈనెల 5వ తేదీన పనులు నిలిపివేశారు. సంబంధిత నిర్మాణదారుడు ఒకరోజు పనులు ఆపివేయగా లోపాయికారిగా ఏమీ ఒప్పందాలు జరిగిందో తెలియదుగాని మూడు రోజుల వ్యవధిలో షెడ్డు నిర్మాణం చక చక జరిగిపోయింది.
- అదే 60గజాలు 100 గజాల్లో చేపట్టే చిన్న చిన్న నిర్మాణాలపై ఎక్కడాలేని నియమ నిబంధనలు చెప్పి పనులు ఆపించే అధికారులకు, ఇలాంటి భారీ షెడ్లు నిర్మించే వారిపై చర్యలు తీసుకోరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



ప్రస్తుతం తయారైన షెడ్డు..

ఆ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు..



నిబంధనలు విరుద్ధంగా నిర్మాణాలను చేపడితే ఊరుకునే ప్రసక్తే లేదు. శ్రీకృష్ణనగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గోదాం నిర్వాహకుడికి ముందే నోటీసులు జారీ చేశాం. అయినప్పటికీ నిర్మాణం చేపట్టడంపై కింది సిబ్బందిపై విచారణ చేపడుతున్నాం. తప్పనిసరిగా ఆ నిర్మాణాన్ని కూల్చివేస్తాం.

– మల్లారెడ్డి, గాజులరామారం ఉపకమిషనర్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా పలువురు శుభకార్యాలకు రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



సంక్షేమ సంఘాలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి

సూరారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

కుత్బుల్లాపూర్: పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని సక్రమ మార్గంలో పయనించేలా కృషి చేయాలని సూరారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో ప్రీ స్కూల్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పై తరగతులకు ప్రమోట్ అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కరస్పాండెంట్ శ్రీనివాస్‌గౌడ్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

- అక్కడికక్కడే వాహనదారుడు మృతి
- పరారీలో లారీ డ్రైవర్

జీడిమెట్ల: ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన సంపత్‌కుమార్(35) జీడిమెట్లలో వెల్డర్‌గా పనులు చేస్తుంటాడు. బుధవారం మధ్యాహ్నం సంపత్‌కుమార్ తన ద్విచక్రవాహనం (టీఎస్082331)పై జీడిమెట్ల ఫేజ్–3 నుంచి జైరాజ్ స్టీల్ పరిశ్రమ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లారీ నెంబర్ (ఏపీ 28 టీ 2331) ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చి సంపత్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కిందపడిన సంపత్‌పై నుండి లారీ చక్రాలు వెళ్లడంతో తల, ఛాతీ భాగాలలో తీవ్ర గాయాలైన సంపత్ అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతుడి అక్క శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

దుండిగల్: ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి కేజిన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రంజన్‌దాస్(26), కేశవ్ కార్(28), కె.గంగా(31)లు బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చారు. బౌరంపేటలోని సతీష్‌చంద్ర సొసైటీలోని గుడిసెల్లో ఉంటూ సెంట్రింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయిని విక్రయించడం మొదలు పెట్టారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన తమ స్నేహితుడు రావణ్‌తో అక్కడి నుంచి గంజాయి తెప్పించుకుని ఇక్కడ విక్రయిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు బౌరంపేటలోని నిర్మానుష్య ప్రాంతంలో వీరి ముగ్గురిని పట్టుకున్నారు. వీరి నుంచి రూ.33వేలు విలువ చేసే 1.35 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. రావణ్ పరారీలో ఉండగా దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

ఓయూలో అధ్యాపక నియామకాలు హుళక్కే..

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ ఏడాది చివరినాటికి వరుసగా ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ ఖాళీగా ఉన్న అధ్యాపక నియామకాలకు అడ్డంకిగా మారనున్నాయి. అధ్యాపకుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న ఓయూలో కనీసం కాంట్రాక్టు అధ్యాపకులను కూడా నియమించకుండా గత ప్రభుత్వం 2014లో జీవో జారీ చేసింది. కేవలం పార్ట్‌టైమ్ అధ్యాపకులచే బోధన కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రొఫెసర్ల కొరత కారణంగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఓయూ విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు.

ఓయూలో బయటి వ్యక్తుల ఆగడాలు అరికట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: క్యాంపస్‌లోకి బయటి వ్యక్తుల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు ఓయూను క్లోజ్డ్ క్యాంపస్‌గా తీర్చిదిద్ది బయటి వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బైక్‌రైడింగ్స్, గంజాయి, మద్యం సేవించడం రియల్ ఎస్టేట్ దందాలు, తదితర అసాంఘీక కార్యక్రమాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లి సత్య, భగత్, శ్రీకాంత్, అశ్వన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో మైనర్లు పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలి

అడ్డగుట్ట: ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మైనర్లు పాల్గొనకుండా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచారాల్లో పిల్లలను కూడా తీసుకెళ్తున్నారన్నారు. బస్తీల్లో రాజకీయ పార్టీలు పంచుతున్న మద్యం, మాదకద్రవ్యాలలో పిల్లలను భాగస్వామ్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఎండలు, రోడ్‌షోల్లో పాల్గొనే పిల్లలు తొక్కిసలాటలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలలను ప్రచారంలో ఉపయోగించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. బాలల హక్కులను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు.

జీహెచ్ఎంసీ ఆదేశాలు బేఖాతరు

- కుప్పలుగా పోసి చెత్తకు నిప్పు పెడుతున్న సిబ్బంది
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆయా కాలనీల ప్రజలు

రంగారెడ్డినగర్: చెత్తకు నిప్పు పెట్టకూడదని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నా సిబ్బంది బేఖాతరు చేస్తున్నారు. రోజువారీ చెత్తను తరలించకుండా స్థానికంగానే కుప్పలుగా పోసి నిప్పు పెడుతూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రతి రోజు 350 టన్నులకు పైచీలుకు చెత్తను ఇళ్ల నుంచి సేకరిస్తున్నారు. బస్తీలు తదితర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసేందుకు చెత్త పాయింట్లను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. అక్కడ పోగైన చెత్తను వాహనాల్లో తరలిస్తున్నారు.

- ఈ క్రమంలో కొన్ని చోట్ల చెత్తను తరలించకుండా స్థానిక పారిశుద్ధ్య సిబ్బంది నిప్పు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. బుధవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్‌లోని ప్రభుత్వం మండల పరిషత్ పాఠశాల ఎదురుగా హెచ్ఎంటీ స్థలంలో డంప్ చేసిన చెత్తకు పారిశుద్ధ్య కార్మికుడు నిప్పు పెట్టాడు. దీంతో ఆ ప్రాంతమంతా పొగలు వ్యాపించాయి. జంట సర్కిళ్ల పరిధిలో ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు భారీ వాహనాలు అందుబాటులో ఉన్నా సిబ్బంది ఈ విధంగా చెత్తను నిప్పు పెట్టడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సంజయ్‌గాంధీనగర్‌లోని ఎంపీపీ పాఠశాల సమీపంలో చెత్తకు నిప్పు పెడుతున్న పారిశుద్ధ్య కార్మికుడు

కేంద్రంలో కాంగ్రెస్ వస్తే రాష్ట్రానికి మేలు



సాయిబాబానగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి బుధవారం సుభాష్‌నగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, జోత్స్నారెడ్డిలతో కలిసి ప్రచార వాహనంపై సూరారం రాజీవ్‌గృహకల్ప, తెలుగుతల్లినగర్, సాయిబాబానగర్‌లలో సునీతామహేందరెడ్డి ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకుందన్నారు. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రానికి మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, నిజాంపేట్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు జేమ్స్, ఐఎన్‌టీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఎంపీలను అత్యధికంగా గెలిపించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర ఐక్యవేదిక సభ్యులు

కుత్బుల్లాపూర్: పార్టీలకు అతీతంగా లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అత్యధికంగా బీసీ ఎంపీలను గెలిపించుకోవాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చట్ట సభలతో పాటు అన్ని రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలంటే అత్యధికంగా పార్లమెంట్‌కు బీసీ ఎంపీలను పంపాలన్నారు. బీసీలందరూ సమైక్యంగా ఉండి పార్టీలకు అతీతంగా బీసీ సామాజిక వర్గం ఏకం కావాలన్నారు. దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కేంద్ర మంత్రిత్వ శాఖ లేకపోవడంతో దురదృష్టకరమని అన్నారు. ప్రమోషన్లలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి పదవిని బీసీలకు కేటాయించాలన్నారు. బీసీ భవన ఏర్పాటుకు 10 ఎకరాల స్థలంతో పాటు రూ.10కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రంగు క్రాంతి, ప్రధాన కార్యదర్శి రాజకుమార్, బీసీ వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరే దశరథం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో మహిళలకు ప్రాధాన్యం



వరలక్ష్మి, భవ్యశ్రీకు నియామక పత్రాలు అందజేస్తున్న కంది శ్రీరాములు

సుభాష్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని సుభాష్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు అన్నారు. బుధవారం డివిజన్ కార్యాలయ సెక్యూరిటీగా వరలక్ష్మిని, సెక్రటరీగా భవ్యశ్రీలను నియమిస్తూ వారికి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... బీజేపీలో మహిళలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్ అంగడి మల్లేష్, డివిజన్ కార్యదర్శి పోలీస్ శివపటేల్, సీనియర్ నాయకులు రాధిక తదితరులు పాల్గొన్నారు.